## ఎత్తునుబట్టా - ఎగరడం!

పట్నవాసంలో సర్వసాధారణంగా కనిపించవు. చెట్లు, పక్షులు, ఇలాంటి ప్రకృతి జీవనాలు. ఒకవేళ ఏరోడ్డు ప్రక్క చెట్లయినా, పేశలశిరీషకుసుమం వొకటి మనమీద రాల్చినా, ఏదో ఒకానొక కోయలపిట్ట కువకువమన్నా, అప్పటప్పటి మేఘంనీడ జరిగినా, అదేమిటోలా గుర్తించకుండా, నాగరీకుడు తన వ్యాపారాన్ని తన వ్యవహారాన్ని చూచుకొంటూ అస్తమానం రిస్టువాచీకేశో ఏదో చిరునామాబల్లకేశో చూస్తూపోతాడు. పైనిచెప్పినవేవీ అతగాణ్ణి ఆపవు.

అయితే ఆనాడా గవర్నమెంటు బిల్డింగు పడగొడుతూంటే ఖణేల్ ఖణేల్ మని గునపంపోటు గట్టిరాయిని గుండెలవిసినట్టు మోగుతూంటే, ధడేల్‌మని గోడ ముక్కముక్కలుగా పడిపోజొచ్చింది. అసలాబిల్డింగు నదులానకట్ట లెరుగనినాడు బ్రిటిష్ వారు కట్టిన రాతికట్టడపు మేడ. అవి నిజానికి రాళ్లుకావు ఉక్కు తునకలే! కాని "కండెమ్మ్‌డు బిల్డింగు"గా వ్రాసేసి మరీ వెళ్లిపోయినారు ఆ పరప్రభువులు. స్వరాజ్యం వచ్చాక మనవాళ్ళు చెట్టుక్రింద జాగాయేచాలు రచ్చచావళ్ళకు అనే రకంవాళ్లు పైని చెప్పిన "నిర్మూలార్హ" భవనాన్ని పడగొట్టకుండానే అట్టేవుంచి పనిజరిగిస్తువచ్చారు నిరుటిదాకా! నిరుడేంజరిగింది? వరద వచ్చింది భవనంలోని కాగితాలన్నీ "గొరగేదె దస్త్రరా"లై యూరుకున్నాయి. "తెప్పానాం తేలానాం" ఎటుపోయినాయో? ఏమైనాయో? గుమస్తాలకే తెలియనప్పుడు మనకా తెలిసేది? మనకు తెలిసిందల్లా వరదతీతలో భవనం అక్కడక్కడ బీటలు తీసిందని.

ఎన్ని బీటలుతీసినా భవనంరూపం చేడ్వడలేదు. అందులోకి

కట్టడముంది. అది మానవ శరీరానికి ముక్కు ఏలాంటిదో, అలా మొనదేరి అమోదదాయకమై యున్నాది. ఠంగ్ మని ఏదరిని భవనం అదిరేధ్వని చేసినా ఈసుందర భాగం శోధనకాబడుతూ వుందా అన్నట్టు, కిటికీలు అద్దాలు పగిలేవి. పగిలి రెండుమూడు చోట్ల క్రిందపడి చితికిపోయినాయి కూడాను. మళ్ళా అతకడానికి ఏలులేకుండా. అద్దాలుపోతే అద్దాలు పునః పురమాయించుకో వచ్చునుగాని చట్రాలు వూడిపోతేనో అది పెనుసమస్యే! ఏమంటారు? అంచేత ఇంజనీర్లు ఏమని నిర్ధారించారనగా అఖర్ని పడగొడదాం అని నిర్ధారించారు. ఏలాగో ఎంత అందమైనదైనా దాన్ని తుదకు పడగొట్టడమనేది నిశ్చయమైపోయింది. ఇంత కాలంలో అది మాత్రం నిరూపితంకాలేదు.

ఈ సంగతి ఏమీ ఎరుగని కొన్ని పచ్చటి రామచిలుకలు మూడో నాలుగో అయియుంటాయి, కొన్ని ఆడవి కొన్ని మగవి కూడా అయియుంటాయి అవి!–ఎదిగినవికూడా అని నాతలపోత! ఎంచేతా అంటే ఎగిరేవి ఆకాశాన కప్పుటప్పుట అవివచ్చి ఆ అద్దాలు పగిలిన కిటికీలదారినే లోపలకుదూరి పైశిఖరాన్ని గూండ్లు కట్టుకుని ఉండిపోసాగాయి.

చూచేవాళ్ళకు పూర్వంలాగే ఊచ ఒకటి చూపించే ఆశిఖరం దాని అడుగున గర్భంలోవున్నట్టు శుకాలు మ్రాగన్నుల వుండేవి ఎవరికీ ఎరుకపడకుండా. వాటికి ఈ మానవుడుచేసే దురాలోచనగాని, దూరాలోచనగాని లేదు. ఉండిపోవడానికి ఒక చోటు అనువైంది ఒకటి తమకు దొరికిందికదా అనే వాటి ఆనందం.

ఇలా వుంటూండగా దాన్ని కొత్తబిల్డింగు అందామా పాత బిల్డింగు అందామా! ఆకొత్తపాత బిల్డింగుకాసే ఒక సాహేబు జవాను ఒకతను వున్నాడు. అతని పడకా అక్కడే నడకా అక్కడే! పైని కప్పు తీసేస్తూవుంటే ఒక ఆనందం పొందేవాడు. ప్రక్కగోడ నూడగొడుతూంటే ఒక ఆనందం పొందేవాడు.

ఎంచేత అంటే ఎదర కొత్తబిల్డింగు లేస్తూవుంది కనుక. సాహెబు గడ్డం మీసం తిలతండులన్యాయంగా నెరిసిన వెంట్రుకలొకకొన్ని నల్లని వెంట్రుక లొకకొన్ని కలిగి వున్నాయి. ఒకరోజురాత్రి ఈ కాపలావుండే సాహేబు, అది వేసంకాలం లోపల ఎటుతిరిగినా ఉక్కతప్పడంలేదు, ఆరుబయట ఆకాశంక్రింద పడుకొంటే చల్లగావుండేదని ఏంచేశాడూ కొత్తగాలేచిన పునాదీ ఒక అరుగులా గుంటే దానిమీద పడుకున్నవాడై ఆకాశంకేసి చూచాడు. ఆకాశంలో చుక్కలు కానరావడంలేదు. చంద్రుడులేడు. మబ్బుగ్రమ్మింది, ఆ మబ్బుకూడా మసకమసక మబ్బుకాదు. బాగా ఉబ్బలిమెత్తినట్టుగావుంది. గాలి వేడిగానిలేదు, చల్లగాలి లేదు, విద్యుద్దీవనగానీ చటక్కన ఆగిపోతే ఏలావుంటుందో అలావుంది జగత్తంతా, ఆపాలంగా ఒక ఆలోచనపోయింది సాహేబుకు. ఎన్నాళ్లకు పాతభవనం పడగొట్టబడి కొత్తభవనం లేచేనో! నన్నిక్కడ కాపలా పడేశారు. లోపల అంతా సామాను పెట్టేరు. వాన కురిస్తే తరిచేను మరోచోటుకు జేరేస్తే కూలీ, అద్దీ ఇవ్వాలి అని ఏదేదో ఊరికే లోకంలోవున్న కోరికలు అన్నీ తనవే అయినట్లు ఆలోచింపసాగాడు అర్థికత.

అంతలో ఒక పెద్దచినుకు ఆమాత్రం మహాముత్యం అంతటిది సాహెబు పెదవుమీద పడింది. జిగాల్; ఏకతాడుగా ఆకాశం నుండి భూమికి మెరసి మరో నిమిషానికి డబడబా ఘోరంగా ఉరిమింది గాలి రివ్వున శీతళంగా వీచింది. భడేల్ భడేల్, ఉన్న రెండుతలుపులు ఆ భవనానివి ఇటూ అటూ కొట్టుకు-ఊడిపోయినాయి. అసలే బాంబులుపడి ముక్కలైనట్టున్న భవనంమీద కాస్త అందమైనచోట పిడుగుపడింది. అయితే ఊచ శిఖరాన్ని వుందికాబట్టి ఏలాపడిందో అలా నేలలోకి దిగిపోయి పొగలేని సెగలేని సొగసున తాండవింపజేసింది భవనాన్నంతనూ!

ప్రక్కనే ఆవరణలో మూడు తాడిచెట్లున్నాయి. ఇందాక ట్నుంచి చెప్పమరచాను. ఆ మూడు తాడిచెట్లలోనూ ఏవొక్క

తాడిచెట్టుమీద పడ్డా మూడూ భస్మీపటలం అయియుండేవి. కాని వాటిమీద పిడుగుపడే అవకాశాన్ని తప్పించివేసింది మన లైట్నింగు కండక్టరు. పడకొన్న సాహేబుమీద పడ్డా అంతే, మరి అతగాణ్ణి పాతిపెట్టనవసరం లేకపోయేది.

ఇక ఆ చుట్టుపట్ల దుఃఖించవలసిన ప్రాణికోటి అల్లా ఈ లైట్నింగు కండక్టరు గర్భంలో దాగివున్న చిలుకలు చిలుకలకు మొదట అవగాహన కావలసింది. మెఱుపైనా మెఱుపు కనిపించక తరువాత ఉరుమే వినిపించింది. వినబడే వినిపించిన పాళంగా వివేకంగనట్టు విడిపడి ఎగిరి ఆచెట్టా ఈచెట్టా అన్నట్టు మూడు, తాడిచెట్లను అక్రమింప సాగాయి మువ్వులట్టుకొని.

అందులో రెండు తాడిచెట్లు మగవి, ఒకటి ఆడది, ఆడ చెట్టున లేతముంజెల గెలలు అయిదారున్నాయి. చలికాయలు కూడాను, తెల్లగా దొరసాని-వి లాగున్నాయి. అంతక్రితం నిమిషమే మెఱుపులో సాహెబు కనులకు మిరుమిట్లు గొలిపాయి. మరుక్షణ మందు చిలుకలు చుట్టూ ఎగరసాగాయి.

ఎత్తునబట్టా ఎగరడం అని అనుకుంటూ తానా చిలకల్ని ఆపుజేయాలనిచెప్పి చరచరా తాడిచెట్టెక్కపోసాగాడు. ఈ సాహె బెప్పుడైతే ఎక్కసాగాడో ఆ తాడిచెట్టు తాడిచెట్టూ జవజవలాడుతూ ఈ ప్రక్కనున్న ఆ ప్రక్కనున్న తాళ్లను ఆడించ జొచ్చింది. మఱో పెట్టుగాలి, ఆ గాలికి దభీమని, దభీమని. దభీమని మూడు తాటిచెట్లు పడ్డాయి. మూడూకూడా లైట్నింగు కండక్టరు వంపుకే, దానిమీదికే పడ్డాయి. నడిమితాడి మరీ బరువుగా పడింది. ముంజె కాయలతో సాహెబుతో-కాని త్రాచుపామును గ్రసించిన గరు డునిలా కదలకుండా అలాగే నిలిచివుంది ఆ మెఱుపు మేతారి! సంగతి నిజం చెప్పవలసివస్తే సాహెబు తాళ్ళకు ఈ లైట్నింగు కండక్టరుక్కు మధ్య నలిగిపోయాడనే చెప్పాలి కాని ఏలాగయితేం తనకు తానే ఇవలకు గడ్డం లాక్కుని పీక్కుని ప్రాణాలైదింటిని అరచేతనుంచుకొని జరిగినదంతా అధికార్లకు నివేదించాడు.

అధికారులు వెంటనేవచ్చి తనిఖీచేసి, సమస్తం నశించినా ఈ లైట్నింగు కండక్టరు పడిపోదంటూ దాని నలావుంచి మరి మిగతా బిల్డింగును మాత్రం పునః కట్టారు. సాహెబును కాపలా వేశారు కొత్తకీ పాతకీ కూడా!

కాని చెట్లు ఆ చుట్టుపట్ల లేమనో ఏమో చిలుకలు మరి రాలేదు. సాహేబు వాటినిగురించి ఎంతచింతించినా అవి మరి రాలేదు. మరి పడగొట్టబడే బిల్డింగూలేదు.

... ... ... ... ...

## జీవితం యొక్క పరమావధి?

జీవితం యొక్క పరమావధి, ఇంత వరకు ఈపెద్ద వయస్సు వచ్చినా బోధపడకుండావుంది. ఒక విధంగా ప్రతీవాడు పుట్టిన తరువాత ఏపనో ఒకపని చేస్తూనే వుంటాడు. వింటూనో పడుకుంటూనో నడుస్తూనో పడుతూనో ఏదోపని చేస్తూనేవుంటాడు. భగవద్గీతలో చెప్పినట్లు ఆఖరుకు ఊపిరైనా పీలుస్తూవుంటాడు. అంచేత ఈ భూమియొక్క లాగుడు శక్తికంటె హైడ్రోజన్ బాంబుయొక్క సర్వవినాశకరశక్తి కంటె మిన్నయైన సూత్రం ఈ కాలక్షేప సూత్రంలో ఇమిడియున్నదని నా తాత్పర్యము. అయితే కాలక్షేపం చేయడంలోనే కరువు, కడుపుకక్కుర్తి, కళావిజ్ఞానము, కర్మ కౌశలము, కష్టం, కనికరం కనిపిస్తూవుంటాయి అవి కంటూంటే సంతృప్తి, దరహాసం ఇవన్నీకూడా జనిస్తూవుంటాయి. ఇలా కాల క్షేపంగా గడియల్ని వెళ్ళబుచ్చడమేనా? ఇంతకంటె మహో న్నతమైన స్థితి ఈ ప్రాణికి వుందా? అని ఒకరోజున నా ఆలోచన పోయింది. అందులోనే నవ్వూవచ్చింది.

అసలు నవ్వు ఆనేది రావడానికి కారణం ఆలోచనే అని నా నమ్మకం; కాబట్టి ఆలోచనతో కూడిన ఈ వ్యాసాన్ని చదివి